క్లుప్తంగా

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



పనులు ప్రారంభిస్తున్న సుధాకర్, అధికారులు

సైదాపూర్: అర్హులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయనుందని ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ అన్నారు. మండలంలో పైలట్ గ్రామం వెన్కెపల్లిలో బైర రేణుశ్రీ, తూటి గౌతమి ఇళ్లకు గురువారం ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. రోడ్లు, రవాణా, విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం జరుగుతోందని, అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ప్రత్యేకాధికారి విజేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రావు, కారోబార్ రమేశ్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్, మ్యాకల రాజు, గుంటి స్వామి, గడ్డం శేఖర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆనంద్

మానకొండూర్: విద్యార్థులకు పొదుపుపై అవగాహన ఉండాలని ఎస్‌బీఐ ఫైనాన్సియల్ లిట్రసీ కౌన్సిలర్ ఆనంద్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు బ్యాంకులో డబ్బు ఎలా పొదుపు చేయాలి, ఖాతా తెరవడం, సైబర్ నేరాల గూర్చి వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు పొదుపు అలవాటు చేసుకుంటే భవిష్యత్ బాగుంటుందని, ఇప్పటి నుంచే బ్యాంకు సేవలను గూర్చి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఫైనాన్సియల్ లిట్రసీ కౌన్సిలర్ క్రాంతి, ఎస్పీ ఎఫ్ఓఎస్ కిరణ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వాలకు పట్టింపు లేదు

సైదాపూర్: ప్రభుత్వాలకు విద్యావ్యవస్థపై పట్టింపు కరువైందని, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కూతాటి రాణాప్రతాప్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. కేజీబీవీ ఆకునూర్‌లో, ఆదర్శ పాఠశాల సోమారంలో, మండలానికి మంజూరైన బీసీ గురుకుల పాఠశాల సొంత భవనం లేక హుజూరాబాద్‌లోని అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతుందని ఆరోపించారు. స్థల సేకరణ చేపట్టి పక్కా భవనం నిర్మాణానికి మంత్రి కృషి చేయాలన్నారు. సోమారం ఆదర్శ పాఠశాల ప్రహరీకి మంత్రి నిధులు మంజూరు చేయించడం హర్షనీయమని, వేసవిలోపు పనులు పూర్తిచేయించాలన్నారు.

'మెప్పు కోసం ఆరోపణలు'

మానకొండూర్: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మెప్పు కోసం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ ఆరోపణలు చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. ఎమ్మెల్యేపై సోషల్ మీడియా, వార్తా పత్రికల్లో వచ్చిన విషయాలే చెప్పానని, పార్టీలు మారడం సహజమని, ఎమ్మెల్యే కవ్వంపల్లి ఎన్ని పార్టీలు మారారో చెప్పాలన్నారు. మానకొండూర్‌లో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని, ఇకపై ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, నెల్లి మురళీ, నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



విద్యార్థులతో రవీందర్, తదితరులు

రామడుగు: ఏకాగ్రత, కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం సాధ్యమని ప్రముఖ రచయిత, గాయకులు డిండిగాల రవీందర్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం మ్యాక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖేలోత్సవ్ నిర్వహించి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్, బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్, హెచ్‌ఎం పద్మజ, రత్నాకర్‌రెడ్డి, అకాడమీ డైరెక్టర్ మహేశ్‌కుమార్, రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, మనోజ్, సురేష్, అనిల్, నవీన్, మహేశ్ పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



చిన్నముల్కనూర్‌లో విద్యార్థినుల డ్యాన్స్



చొప్పదండిలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



రామడుగులో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని మోడల్ స్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో శ్రీనివాస్, నోడల్ అధికారి పి.మోహన్, హెచ్‌ఎంలు సుధాకర్, శ్రీనివాస్, శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శపాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలునిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి పరీక్షల్లో మంచిమార్కులు సాధించి పైచదువులు చదవాలని ప్రిన్సిపాల్ హర్షిత్‌కౌర్ కోరారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హేమలత, సామాజిక సమరసత రాష్ట్ర ప్రముఖ్ ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, శివకుమార్, టౌన్ సీఐ రవి, వ్యవస్థాపక ప్రధాన ఆచార్యులు సాంబయ్య, రాజేశ్వరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, విద్యా పీఠం జిల్లా కార్యదర్శి రాజమౌళి, రాజేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. లోటస్‌పాండ్‌లో గ్రాడ్యుయేట్ డే ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్‌రావు విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు రాబోయే రోజుల్లో లీడ్ ప్రొఫైల్ ఎడ్యుకేషన్ సంస్థతో కలిసి విద్యా బోధన అందించనున్నామని తెలిపారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు నిర్వహించారు. కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామం ముదిరాజ్ సంఘ భవనం సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. మూలమలుపు వద్ద ఇటీవల డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డుకు రెండు వైపులా మురుగుకాలువలున్నాయి. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాహనాలు నేరుగా మురుగుకాలువలోకి వెళ్తున్నాయి. ఓ యువకుడు మురుగుకాలువలో పడిపోగా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రెయిలింగ్ వంటి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్ నంబర్: 9440818867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

జగ్గయ్యపల్లిలో ఆరోగ్య మహిళా శిబిరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

జమ్మికుంట: ఆరోగ్య మహిళా శిబిరాన్ని వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో గురువారం వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా శిబిరంలో మాట్లాడారు. శిబిరంలో 56 రకాల వైద్య పరీక్షలు చేస్తారని, మహిళలు మూడు నెలలకోసారి పరీక్షలు చేసుకోవాలని, ఈ కార్యక్రమంతో కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం వడదెబ్బ, డ్రై డే, టీబీ నిక్షయ్ శివిర్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్‌గౌడ్, మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ కుసుమకుమారి, ఆరోగ్యశాఖ సిబ్బంది శ్యామల, రామకృష్ణ ఆశాలు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు, రైతుల ఆందోళన



ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని, ఇప్పటికే ఎండిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపు నివ్వడంతో మండలంలోని నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పోలీసులు గుమిగూడిన జనాన్ని చెదరగొట్టారు. రెండు గ్రూపులుగా విడిపోయిన నాయకులు, రైతులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించగా పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామం నుంచి ఆందోళనకు బయలు దేరిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రైతుల సమస్యపై స్పందించే హక్కు లేదా అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోతుంటే నారాయణపూర్ రిజర్వాయర్ నీళ్ల వేములవాడ నియోజకవర్గానికి తరలించుకుపోతున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు.

సన్మానం



నిఖిల్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని బృందావన్‌కాలనీలో నివాసం ఉంటున్న గ్రూప్–2 టాపర్ నిఖిల్‌రెడ్డిని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. ఇప్పటికే నిఖిల్‌రెడ్డి గ్రూప్–4లో డీటీసీ ఉద్యోగం సాధించాడు. కరీంనగర్‌లో పనిచేస్తూనే గ్రూప్–2లో విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు తూర్పాటి రాజు, తిప్పబత్తిని రాజు, పోతుల సంజీవ్, బొరగాల సారయ్య, సబ్బని రమేష్, గంట సంపత్, గుడిపాటి కొండారెడ్డి, హృతిక్, మోతే మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులకు..



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాయిత రాములు, కామిని రవీందర్‌ను అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ కమిటీల బాధ్యులు గురువారం శాలువాలతో సత్కరించారు. సమాజంలో పాత్రికేయ వృత్తి గౌరవమైనదని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నూతన అధ్యక్ష, కార్యదర్శులు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు ఖాలీద్ హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, రొంటాల సుమన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జేఏసీ అధ్యక్షుడు సమ్మయ్య, ప్రజా సంఘాల నాయకులు జనార్దన్, ఈశ్వర్‌రెడ్డి, రత్నం, రవీందర్, సమ్మయ్య, శివదయాల్ సింగ్, సతీశ్, బాబు, ప్రభాకర్, వెంకన్న, లక్ష్మణమూర్తి, శ్రీని వాస్, సత్యనారాయణ, కరుణాకర్,చంద్రశేఖర్, కె.ఆర్ భిక్షపతి, నరేష్, రాజేందర్, రాజేష్, రాజ్‌కుమార్, అశోక్, తిరుపతి, జగదీశ్వర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ రవీంద్రనాథ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి 9959225924 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నూతన కమిటీ

హుజూరాబాద్: ఆదివాసం తోటి తోగ సేనా సంఘం హుజూరాబాద్ పట్టణ నూతన కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా ఆత్రం సదానందం, ప్రధాన కార్యదర్శిగా షెడమాకి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ఆత్రం సతీష్, షెడమాకి కుమరస్వామి, సహాయ కార్యదర్శులుగా ఆత్రం శ్రీనివాస్, సాయం రమేష్, సాయం ప్రవీన్, కోశాధికారిగా షెడమాకి గుణశేఖర్, కార్యనిర్వహణ అధ్యక్షులుగా ఆత్రం అశోక్, రాజు, ప్రచార కార్యదర్శులుగా సురేష్, గుర్రాల సిద్దు, రాజేష్, ప్రతాప్, వినీత్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్రైం వార్తలు

▲ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన జక్కె ప్రణయ్ ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

▲ కంప్యూటర్లు చోరీ

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లోని మూడు కంప్యూటర్లను చోరీ చేశారు. ఈ నెల 8 నుంచి 9వ తేదీ వరకు సెలవులు కాగా 11న కంప్యూటర్ క్లాస్ ఇన్‌చార్జి తరగతి గదికి వెళ్లి చూడగా కంప్యూటర్లు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ప్రిన్సిపల్ మొయిన్ బేగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

▲ కిరాణా దుకాణంలో చోరీ

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామం కిరాణా షాపులో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన భూర్ల లక్ష్మి వస్తువులు విక్రయించిన, మహిళా సంఘానికి నగదును దుకాణంలో పెట్టి బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి దుకాణంలోని వస్తువులు చిందరవందరగా పడిఉండటంతో పాటు క్యాష్ కౌంటర్‌లోని సుమారు రూ. పన్నెండు వేలకుపైగా నగదును దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్సై రవి షాపును పరిశీలించి వివరాలు సేకరించారు.

పోలీసుల బందోబస్తు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద గురువారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇళ్లను సీపీఐ నాయకులు పంపిణీ చేస్తారనే సమాచారంతో ముందస్తు బందోబస్తు నిర్వహించామని టౌన్ సీఐ రవి తెలిపారు.

▲ రేషన్ బియ్యం పట్టివేత

తిమ్మాపూర్(గన్నేరువరం): మండలకేంద్రంలో గురువారం రాత్రి రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. చొక్కారావుపల్లె నుంచి గన్నేరువరంకు ఆటోలో సుమారు 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

▲ మిస్సింగ్ కేసు

చొప్పదండి: పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన మరిమడ్ల మల్లయ్య(70) కనిపించడం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లయ్యకు మతిస్థిమితం సరిగా లేదని జనవరి 30న ఇంటి నుంచి వెళ్లి మళ్లీ రాలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని, ఎవరికైనా కనిపిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

▲ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తిమ్మాపూర్(గన్నేరువరం): గుండ్లపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. హన్మాజిపల్లె నుంచి కరీంనగర్ వైపు బైక్‌పై వెళ్తున్న సాయికృష్ణ హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న అభినవ్, శ్రీవర్ధన్ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అభినవ్ తండ్రి మధు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ముందస్తు అరెస్ట్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజును కేశవపట్నం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అమలు చేయాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనకు హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకున్నారు.

■ వెలిచాలలో వైభవంగా డోలోత్సవం



రామడుగు: మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేదపండితులు డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం, బండ్ల తిరుగుట కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతిపూజ



గణపతిపూజ నిర్వహిస్తున్న భక్తులు

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేదపండితులు ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో గురువారం భక్తులు గణపతి పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం, శనివారం ఉత్సవమూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన, కల్యాణ మండప ప్రారంభోత్సవం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని వేదపండితులు కోరారు.

మంత్రి పదవి రావాలని పూజలు

తిమ్మాపూర్(గన్నేరువరం): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు మంత్రి పదవి రావాలని కోరుతూ అంతగిరి పోచమ్మ ఆలయంలో గుండ్లపల్లి గ్రామస్తులు, నాయకులు గురువారం పూజలు నిర్వహించారు. త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే చోటు దక్కాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, అధికార ప్రతినిధి ముల్కల మల్లేశం, నాయకుడు చాడ సతీష్‌రెడ్డి, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎర్రల రాజయ్య, పీచు సుధాకర్‌రెడ్డి, కుర్మెల్లి రమేశ్, సుంకరపెల్లి అనిల్, కుర్మెల్లి సంతోష్, రేవోజ్ కృష్ణమాచారి, చింతల రాజు, కుర్మెల్లి రాజు, చింతల విక్రమ్ పాల్గొన్నారు.

అసౌకర్యం కలిగించొద్దు

జమ్మికుంట: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టౌన్ సీఐ రవి అన్నారు. వరుస పండుగల నేపథ్యంలో గురువారం పట్టణంలోని గుల్జార్ మసీదు వద్ద ఉపవాస దీక్షలోని ముస్లింలు, హోటల్, బిర్యాని పాయింట్ యజమానులు, వాహనదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హోలీ, ఉగాది, రంజాన్ ఒకేనెలలో వస్తున్న సందర్భంగా ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని, హోలీ సంబరాల్లో ఇతరులపై బలవంతంగా రంగులు చల్లే ప్రయత్నం చేయొద్దని సూచించారు. హోలీ పండుగ నేపథ్యంలో హోటల్, బిర్యాని పాయింట్లు రాత్రి పదిగంటల వరకే మూసి వేయాలని, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగాధర: విద్యార్థులు చదువుతో పాటు పండుగలు, ఆచారాలపై అవగాహన పెంచుకోవాలని బూర్గుపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనితా కుమారి సూచించారు. గురువారం పాఠశాల వార్షికోత్సవం, ముందస్తు హోలీ నిర్వహించారు.

రామడుగు: మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు హోలీ జరుపుకున్నారు.

ఇష్టంతో చదవాలి



పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న రావుల రమేశ్

తిమ్మాపూర్: విద్యార్థులు ఇష్టంతో చదవాలని బీఆర్ఎస్ మండలం అధ్యక్షుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేశ్ సూచించారు. 'రమేశ్ అన్న చిరుకానుక' పేరుతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ వీరారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేశ్, మాజీ ఎంపీటీసీలు సంపత్ రెడ్డి, కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి,మురారి రెడ్డి, దేవేందర్ రెడ్డి, రాజేష్, శ్రీనివాస్, అంజయ్య, సంజీవరెడ్డి, సుధాకర్, సమ్మయ్య, ఐలయ్య, సంపత్, సయ్యద్ ఫరూక్, రాజు, అశోక్, శ్రావణ్, జగదీశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

మానకొండూర్/హుజూరాబాద్/రామడుగు/గంగాధర/శంకరపట్నం: ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తర్వాత ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్నా సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామకాలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. మాదిగలకు అన్యాయం జరగకుండా చూడాలని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. వర్గీకరణ చట్ట భద్రత కల్పించే వరకు నోటిఫికేషన్లు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

● రైతుల కోసం రవిశంకర్ మొసలి కన్నీరు

చొప్పదండి: రైతుల గోసపట్టించుకోని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. రైతుల మేలు కోసం పని చేస్తున్న మేడిపల్లి సత్యంను బదనాం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, గతంలో నారాయణపూర్ నుంచి నీరు విడుదల చేయాలని మేడిపల్లి సత్యం ఆందోళన చేసిన సమయంలో రెండుసార్లు మాత్రమే నీరు విడుదల చేశారని, ఇప్పుడు ఎమ్మెల్యే సత్యం ఎప్పటికప్పుడు నీరు విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు.

● ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామ మానేరు వాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు గురువారం పరిశీలించారు. ఇసుక నిల్వ, వేబ్రిడ్జి తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వెంట తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

● గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

తిమ్మాపూర్(గన్నేరువరం): ప్రభుత్వం గీత కార్మికుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి జాగిరి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మండలంలోని గునుకులకొండాపూర్‌లో గురువారం మాట్లాడారు. ఈత, తాటి వనాల పెంపకానికి ఐదెకరాల భూమి కేటాయించాలని, గౌడ వృత్తిని ప్రోత్సహించి ప్రతీ గీత కార్మికుడికి సేఫ్టీ కిట్స్ అందరికి ఒకే విడుతలో మంజూరు చేయాలన్నారు.

● ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామశివారులో గురువారం ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులుపడ్డారు.ఫ్లైఓవర్ వద్ద వన్‌వేలో కరీంనగర్–వరంగల్ వైపు రెండు లారీలు ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనాలు ఇరువైపులా గంటల పాటు నిలిచిపోయాయి.

● ఆయన కళ్లు సజీవం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన సిరిపురం రాజేందర్ (50) గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతుడి నేత్రాలను కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది సేకరించారని గ్రామస్తులు తెలిపారు.

● సీఎం దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలో గురువారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.